# క్షణకోపం కోపక్షణం

కోపపడనంటే చెబుతా' అంటూ ప్రసంగం మొదలుపెట్టే వాళ్ళు కోపంవచ్చేవారికి రాకుండామాట్లాడే యుక్తిపరులు। తామెంతో శాంతివాదులైనట్లూ, ఎదుటివాళ్ళు కోపగొండులైనట్లూ చెప్పే అంత యుక్తిపరులే కోపం ముంచుకొచ్చినప్పుడు కోతి చేష్టలు చేస్తారు.

కొందరికి ముక్కు మీదే కోపం- అప్పటి కోపం అన్యాయమెరుగదు- చిరుబురు చిరుకోపాలకు గురి అయిన ఆలుమగల ఎడమొహం, పెడమొహం చూడ చింత- వండమంటే ఆవిడకు కోపం, తినమంటే ఆయనకు కోపం- నిత్యమూ ఇలాగే కమ్మగా వండితే నిన్నెందుకు కోప్పడతాను అన్నాడట ఓ మగరాయుడు. ఆలుమగల కోపం అదెంతవరకు? అంటే అస్తమానం వరకే అన్నారు పూర్వులు. చూడండి ఇదెంత మంచి సంప్రదాయమో.


ఉత్తముల కోపం క్షణకాలం అంటారు. వాళ్ళు ఉత్తములవునో, కాదో కానీ, క్షణకాలమే వుండే కోపం మాత్రం ఉత్తమమైందే. అలా కాకుండా కోపం పెరిగి, తాపం పొంగి మనిషి పిశాచి రూపమెత్తి, తాను సృష్టించుకున్న అందమైన పరిసరాలను తానే ధ్వంసం చేసుకునే ఈనాటి సంఘటనలు కోకొల్లలు. మండే గుడిసెలూ, కాలి కూలే మేడలూ, తగలబడే బస్సులూ, విలవిలలాడి చచ్చే అమాయకుల ప్రాణాలూ ఇలాంటివన్నీ మానవ పిశాచుల కోప ఫలితాలు.

కోప స్వభావం ఎందుకు రగులుతుంది? దీనికి కారణాలెన్నయినా చెప్పవచ్చు. ముఖ్యంగా ఒకరి బాగు చూసి ఓర్వలేని వాళ్ళకు, శక్తిలేని దుష్టబుద్ధులకు కోప స్వభావం జాస్తి. తన తెలివితక్కువ బయట పడుతుందనో, లోభం బయటపడుతుందనో, తప్పు బయటపడుతుందనో భయం పట్టుకున్నప్పుడు కూడా అది కోప రూపంలో బయటపడి, చిరాకు చేష్టలూ, వికార ముఖాలు, తికమక వాగుడూ బయట పడుతుంటాయి. కేవలం బలహీనత వల్లనే కాదు, తన బలానికెదురు లేదు అనుకున్న మనిషి ముఖంలో కూడా అదో రకం చిరాకు రగిలి, అనవసరమైన కోప వాలకంగా మారుతుంది. చీటికి మాటికి కోప్పడటం, గంభీరం పోగొట్టుకుని గర్వంతో చూడడం, చివరకు గండు కుక్కలాగా అరవటం బలగర్వాంధుల లక్షణం.

అదేదో కలిసి వచ్చిందిరో, అతను చూడు ఎలా ఎదిగిపోతున్నాడు? చూసి భరించేదెట్లా? అనుకునే వాళ్ళకు అనవసర ద్వేషం, రోషం పెరిగి పెరిగి అనవసర కుటిలంగా మారి చివరకు వాళ్ళ వ్యక్తిత్వాన్నే నాశనం చేస్తుంది.

ఒక మనిషి మీది కోపం క్రమంగా ఆ కుటుంబంపై, ఆ వర్గంపై, ఆ మతంపై కోపంగా, వైరంగా మారి అది కుటుంబ కలహాలుగా, వర్గ కలహాలుగా, మత కలహాలుగా మారి మారి మహమ్మారి రూపం దాలుస్తుంది. ఒకరి కోపానికి మరొకరి అజ్ఞానమో, దురాశో, ఆక్రమణో కారణమవుతున్నది.

కోపంతో భయపెట్టి ఊరకుంటే నయమే. కొందరి కోపం పసిక నవ్వులో మెరిసిపోయి తర్వాత హాని చేస్తుంది. ఈ పసిక నవ్వుల కోకిష్ఠుల కంటె పాములే నయం. కొన్ని పాములు బుస్సు మని భయపెట్టి అలా తొలగిపోతాయి.




తల్లిదండ్రులు తమ సంతానంపై, ఉపాధ్యాయులు విద్యార్థులపై, అన్నలు తమ్ములపై, రచయితలు సమాజంపై, వ్యవస్థలపై కోప్పడుతుంటారు. ఈ కోపంలో వున్నది అసహనం కాదు, ద్వేషమసలే కాదు. ముఖ్యంగా వున్నది బాధ, బాధే, తన వాళ్ళు చెడిపోతున్నారనే బాధే.

అత్తమామల కసిరింపులకూ, ఆడబిడ్డల విదిలింపులకూ, తోడికోడళ్ళ అసూయలకూ గురి కావి ఆడపడచులది నిజంగా అదృష్టమే.

ఉద్యమ నాయకుల కోపాలు ఉపన్యాసాలలో వెలిగినంత వరకు అవి వెలుగు దీపాలుగానే కనిపిస్తాయి. ఈ వెలుగు దీపాలే కొంపలు కాల్చే ప్రమాదం కూడా వుంది. అక్కడ జాగ్రత్తపడవలసింది మనం. హాని చేయని కోపం ధర్మ కోపం. అంటే అధర్మం మళ్ళీ జరగకుండా చూసే కోపం. మన జాతీయోద్యమ కార్యకర్తలు చేసిన సత్యాగ్రహాలు ధర్మ కోపాన్ని చూపినవే.

పిల్లల కోపం ముద్దొస్తుంది. కొంటెగా ఏడుస్తారు. తమకు కావలసింది సాధిస్తారు.

పిల్లలు అమాయకంగా అడిగే ప్రశ్నలు కొన్ని పెద్దలకు కోపం తెప్పిస్తాయి. ఆ కోపంతో పిల్లలను బాదుతారు. పిల్లల ప్రశ్నలకు యుక్తిగా సమాధానం చెప్పలేనివారిది అజ్ఞానమే, పెద్దరికం కాదు.

భార్య ఇన్ని అవమానాలకు గురి అయినా చూస్తూ ఊరకుండే మగడు ఏం మగడు? అవమానించే శత్రువులపై కోపం రాని ధీరుడు ఏం మగధీరుడు? అని ఒకసారి ద్రౌపది ధర్మరాజు మొహం మీదే అనేస్తుంది — అమాయకురాలా, కోపమనేది అసలు రాకూడదు. వస్తే, అది ఎంత పని చేయాలో అంత పనీ చేసి తీరాలి. కాబట్టి అలాంటి మగసిరిగల కోపం వచ్చేదాకా ఆగు చూస్తావు తడాఖా అంటాడు ధర్మరాజు. నేర్పరితనంగల కోపం ధర్మరాజుది. ఎన్నో యేండ్ల దాకా ఎక్కడా పొటమరిల్లకుండా దాగి వున్న ఆయన కోపం చివరకు ఎంతపని చేసిందో భారతం చదివిన వాళ్ళకు తెలుసు.

కోపం వచ్చినప్పుడు అది హానికి కారణం కాకుండా ఏం చెయ్యాలి? అన్నది అందరికీ సమస్యే. కోపం వచ్చినప్పుడు ఒకటి నుంచి పది వరకు చేతివేళ్ళు లెక్కపెట్టుకోమన్నారు. ఆ లెక్కలో కోపం చాలా వరకు అణగిపోతుంది. తగిన ఆలోచన తడుతుంది. కోపం వచ్చినప్పుడు వెంటనే అద్దంలో ముఖం చూసుకొమ్మని చెప్పిన సలహా మరీ బాగుంది. ఎంత అందచందాలున్న వాళ్ళయినా కోపంలో దయ్యపు ముఖమే పెడతారు. ఇందరిన్ని చెప్పినా తమ కోప రాక్షసికి తమవాళ్ళనే బలిచేసి, తామే బలి అయిన సంఘటనలు వింటూనే వున్నాం.

అందుకే 'తన కోపమే తన శత్రువు, తన శాంతమే తనకు రక్ష' అన్నాడు సుమతి శతకకారుడు.

ముకురాల రామారెడ్డి